క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

రాయచోటి అర్బన్ : ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఎల్.నరసింహులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రాయచోటి పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లెయిములను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు మహబూబ్‌బాషా, నాయుడు, బాబ్జి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర, వెంకటరమణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

లక్కిరెడ్డిపల్లి : డిసెంబర్ 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ రూల్స్ అధిగమిస్తే శిక్ష తప్పదు

నందలూరు (రాజంపేట) : ట్రాఫిక్ రూల్స్ అధిగమిస్తే శిక్ష తప్పదని సర్వీసెస్ కమిటీ చైర్మన్ జూనియర్, సివిల్ జడ్జి కె.లత తెలిపారు. బుధవారం సాయంత్రం ట్రాఫిక్ రూల్స్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపితే ఆరునెలలు జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరసింహులు, మన్నూరు సీఐ మంజునాథ రెడ్డి, నందలూరు ఎస్ఐ అబ్దుల్ జహీర్, పెనగలూరు ఎస్ఐ బి సుబ్బారెడ్డి, న్యాయవాదులు మహమ్మద్ అలీ, సుబ్బరామయ్య, కోర్టు కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

రశీదులు భద్రపరచుకోవాలి

సిద్దవటం : ఈ–పంట నమోదుపై ప్రతి రైతుకు రశీదులు ఇచ్చి సదరు రైతుతో సంతకం తీసుకుని భద్ర పరచుకోవాలని రైతు భరోసా కేంద్రం సహాయకులకు, మండల వ్యవసాయాధికారికి సూచించామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం. నాగరాజు తెలిపారు. సిద్దవటంలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి ఈ–పంట నమోదు రశీదులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించండి

ఓబులవారిపల్లె : రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతు సమస్యలపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాల తనిఖీ

నందలూరు (రాజంపేట) : స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ నిర్వహణ ఉప సంచాలకుడు శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి అమీరుద్దీన్‌లు బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి అనంతకృష్ణ, ఉపాధ్యాయులు కృపానందం, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సి.రామయ్య, సుబ్రమణ్యంశర్మ, తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : సిద్దవటం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించామని గ్రంథాలయ ఆధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు.

అయ్యప్ప నామస్మరణ

లక్కిరెడ్డిపల్లి : కార్తీకమాసం మొదలు కావడంతో అయ్యప్ప మాలధారణ స్వీకరించిన అయ్యప్ప భక్తులు బుధవారం మండలంలోని నామాలగుట్టపై నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గురుస్వాములు వెంకటేశు, నరసింహారెడ్డి, గంగరాజు, నాగేంద్ర, సుధీర్ పాల్గొన్నారు.

24 నుంచి కలామ్స్ విజన్–2023 సైంటిఫికల్ ప్రాజెక్టు

చిన్నమండెం : ఈనెల 24, 25 తేదీలలో రాయచోటిలో నిర్వహించబోయే కలామ్స్ విజన్–2023 సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయుడు బి.రెడ్డన్న, ప్రాజెక్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్ కోరారు. బుధవారం మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ రూపొందించిన కలాం విజన్ సైంటిఫికల్ ఎక్స్‌పో కరపత్రాన్ని ఆవిష్కరించారు. రిజిస్ట్రేషన్ కోసం 6281453550, 9391932752 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఆడుదాం ఆంధ్రపై అవగాహన

సిద్దవటం : ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఈనెల 20వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించామని ఎంపీడీఓ జవహర్ బాబు, ఎంఈఓ శంకరయ్య తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం పాలన

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

లక్కిరెడ్డిపల్లి : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి మండలం, పందిళ్లపల్లెలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ సీఎం జగన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి పథకాల ద్వారా రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రగతిపథంలో నిలపడాన్ని శ్రీకాంత్ రెడ్డి ప్రజలకు వివరించారు. పందిళ్లపల్లె గ్రామానికి చేసిన మంచిని గణాంకాలతో సహా కళ్లకు కట్టినట్లు వెల్లడించి సంక్షేమ పథకాల బోర్డును స్థానిక నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌లు ఉమ్మడి మేనిఫెస్టోతో వస్తున్నారని, వారికి తగినరీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సుపరిపాలన కొనసాగాలంటే సీఎం జగన్‌ను ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో వెలిగల్లు కాలువల ద్వారా లక్కిరెడ్డిపల్లె మండలంలోని దాదాపు 80శాతం చెరువులకు సాగునీరు నింపి ఎమ్మెల్యే రైతులకు అండగా నిలిచారని కొనియాడారు. మాజీ ఎంపీపీ రెడ్డెయ్య మాట్లాడారు. మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, మాజీ ఎంపీటీసీ రాజేంద్రనాథ్ రెడ్డి, సర్పంచ్‌లు బాబు, వెంకటనారాయణ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఉదయగిరి ఎల్లమ్మ, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి
– ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతీపురం, మండలంలోని కూచివారిపల్లె–2 సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్ర నిర్వహించి ప్రజల కష్టాలను తెలుసుకున్నారని, అందువల్లే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నవరత్నాల పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ఈ పథకాల వల్ల పేద, మధ్య తరగగతి ప్రజలకు ప్రయోజనం చేకూరి, ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాకుంటే ప్రస్తుతం ప్రజలకు అందుతున్న ఏ ఒక్క పథకం కూడా అందదన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లకు మా నమ్మకం నీవే జగన్ కిట్లను ఎమ్మెల్యే అందచేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జెనుగు కృష్ణారావు యాదవ్, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, జేసీఎస్ మున్సిపాలిటీ, మండల ఇన్‌చార్జిలు వడ్డే రమణ, మందరం గంగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డిమాసి రమేష్ నాయుడు, ఎస్.జాకీర్ హుస్సేన్, దండు గోపి, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, నటవ వెంకటరమణ పాల్గొన్నారు.

సీఎం జగన్ పేదల ముఖ్యమంత్రి

వీరబల్లె (రాయచోటిటౌన్) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ముఖ్యమంత్రి అని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మట్లి గ్రామంలోని సచివాలయంలో సర్పంచ్ నాగార్జునాచారి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యుడు శివరాం గౌడ్, వీరబల్లె మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి వీరనాగిరెడ్డి, వీఆర్‌రెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్

చిట్వేలి : రాష్ట్రంలో పేదలకు, పెత్తందార్లకు జరిగే యుద్ధంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షాన నిలిచారని మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగిరిపాడు సచివాలయంలో రాష్ట్రానికి జగనన్న మళ్లీ ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్‌వి మోహన్ రెడ్డి, లింగం లక్ష్మీకర్, మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

చిన్నమండెం : ప్రతి హామీని నెరవేర్చి ప్రజల గుండెల్లో నిలిచిన జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవగుడిపల్లె సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు అవసరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ దివ్య, పంచాయతీ సెక్రటరీ సుమిత్రమ్మ, సర్పంచ్ అమృతమ్మ, ఎంపీటీసీ తులసమ్మ, ఉపసర్పంచ్ శ్రీలత, మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, మండల ఉపాధ్యక్షుడు ఏజాస్‌ఆలీఖాన్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

నందలూరు (రాజంపేట) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. పొత్తపి గ్రామ పంచాయతీలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి అంటే అనే కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, జేసీఎస్ మండల కన్వీనర్ కరీముల్లా ఖాన్, సర్పంచ్ విజయకుమార్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

గాలివీడు : రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఖాదర్‌మొహిద్దీన్, సర్పంచ్ ఉమాపతిరెడ్డిలు అన్నారు. బుధవారం పూలకుంట సచివాలయంలో వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గడ్డం చంద్రప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హరినాథరెడ్డి, ఉప సర్పంచ్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మరోమారు జగన్‌ను ముఖ్యమంత్రిని చేద్దాం

రామాపురం : మరో మారు వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డిలు అన్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ గ్రామ సచివాలయంలో బుధవారం ఏపీకి సీఎం జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఈఓపీఆర్‌డీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాల్లో మార్పు

రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బొజ్జవారిపల్లెలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సామాజిక న్యాయం నినాదంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తూ మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ సుబ్బయ్య, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ దాడిశెట్టి సిద్ధు, సూర్యనారాయణ, హరిక్రిష్ణ, తోట శివసాయి, ఎంపీటీసీ రాజా, పురుషోత్తం, మల్లు క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేర్చిన ఘనత జగన్‌దే

సంబేపల్లె : ప్రతి హామీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌దే అని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రైతుగుంట పంచాయతీలో గ్రామ సర్పంచ్ హసీనా ఆధ్వర్యంలో ఆంధ్రాకు మళ్లీ జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రతి పేదవారి ఇంటి ముంగిటకే ప్రభుత్వం నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య ప్రదాత జగన్

ఓబులవారిపల్లె : రాష్ట్రంలో ప్రజలందరికీ విద్య, వైద్యం అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే అని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చిన్నఓరంపాడు గ్రామంలో ఆంధ్ర రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సింగల్ విండో అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి, ముక్కా రమేష్ కుమార్ రెడ్డి ఎంపీటీసీ దుర్గాప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనర్ అమరేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే వైఎస్ జగన్ ఆశయం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



వెలగచర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల

పెనగలూరు : ప్రజల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కొండూరు పంచాయతీలోని వెలగచెర్ల గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్ రెడ్డితో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ముఖ్యంగా సామాన్య ప్రజలకు కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పించి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముందున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను దేశంలో ఇతర రాష్ట్రాలలో కూడా అనుసరించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌కు అండగా నిలిచి మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీతోపాటు మండలాన్ని అన్ని విధాలుగా తమ కుటుంబం అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాల ఇతర వసతులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రామాంజులమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, పెనగలూరు సొసైటీ ఉపాధ్యక్షుడు కె.జయరామయ్య, కన్నారెడ్డి, శ్రీపతి రెడ్డి, వెంగయ్య, కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్ రావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మతో కొరముట్ల చర్చలు

మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మతో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు బుధవారం సుదీర్ఘ చర్చలు జరిపారు. ప్రభావతమ్మ స్వగ్రామం కొండూరులో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభావతమ్మ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీనియర్ నాయకురాలు కావడంతో ఆమెతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రభావతమ్మ మాట్లాడుతూ నాయకులు ఇప్పటి నుంచే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్తే ప్రజలలో మరింత మార్పు వస్తుందన్నారు. పేదరికం నిర్మూలించాలంటే జగన్‌కు ఒక్కరికే సాధ్యమన్నారు. తిరిగి జగన్‌ను సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఉదయగిరి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా రాయచోటి మున్సిపాలిటీ

మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పక్కనే చైర్మన్ ఫయాజ్‌బాషా

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపాలిటీని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుదామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ సభా భవనంలో చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రేడ్–3 స్థాయిలో ఉన్న మున్సిపాలిటీని గ్రేడ్–1కు, ఆ తర్వాత స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించుకునేందుకు ఎంతో కృషి చేశామన్నారు. అలాగే కౌన్సిలర్లు, అధికారులు సమష్టి కృషితో అన్ని రంగాలలో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించి కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయించుకుందామని చెప్పారు. పట్టణంలో తాగునీరు, పారిశుధ్య చర్యల మెరుగుదలకు అందరూ కృషి చేయాలన్నారు. సమావేశానికి పలు ప్రభుత్వశాఖల అధికారులు హాజరు కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భవనాలకు మహనీయుల పేర్లను పెట్టడం ద్వారా ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బ తినకుండా చూద్దామని సూచించారు. ప్రజల సౌకర్యం కోసం పట్టణంలో ఆర్‌టీసీ టౌన్‌సర్వీసు బస్సులను నడిపేందుకు ప్రయత్నిస్తామన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. పట్టణంలోని కొత్తపల్లె ప్రాంత ప్రజల తాగునీటి సమస్యను తీర్చాలని, పాతమున్సిపల్ భవనం స్థానంలో ఓహెచ్‌ఎస్‌ఆర్‌ను నిర్మించి సమస్యను తీర్చాలని, పట్టణంలో మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ రౌనఖ్ హుస్సేన్ కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో ఓహెచ్‌ఎస్‌ఆర్‌ను నిర్మించి ప్రజల తాగునీటి ఇబ్బందులను తీరుస్తామని, మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఠాణా వద్దనుంచి కడప మార్గంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయించాలని కౌన్సిలర్ హరూన్‌బాషా కోరారు. నక్కావాండ్లపల్లె సమీపంలో నిర్మితమవుతున్న క్రికెట్ స్టేడియం ప్రాంతాన్ని స్పోర్ట్స్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల వివరాలు

ఈనెల 18 లేదా 19 వ తేదీన రాయచోటి ఆర్‌టీసీ బస్టాండు ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నెలాఖరులోగా నగరవనం, డిసెంబరు మొదటి వారంలో వందపడకల ఆసుపత్రి భవనాల ప్రారంభం ఉంటుందన్నారు. డిసెంబరు 15న క్రికెట్ స్టేడియం, సంక్రాంతిలోగా శిల్పారామాల ప్రారంభ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధిలో ఎమ్మెల్యే కృషి

మున్సిపాలిటీ అభివృద్ధిలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషి ఎనలేనిదని కౌన్సిలర్లు పేర్కొన్నారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయించడం, అసెంబ్లీ తరహాలో మున్సిపల్ సభా భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అయ్యప్ప దేవస్థానంలో మండల పూజలు



మాట్లాడుతున్న దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు

రాజంపేట రూరల్ : అయ్యప్పస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి మండల పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. పట్టణ శివార్లలోని భవనగిరిపల్లి ఆర్చి సమీపంలోని మణికంఠనగర్‌లో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం ధర్మకర్తల మండలి ప్రతినిధులు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం వేకువజామున అన్నపూర్ణదేవి విగ్రహ ప్రతిష్ట , పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 27వ తేదీ వరకు దేవస్థానంలో ప్రతి రోజు రాత్రి పూజలు, మాలధారులకు భిక్ష అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపెంట పాలప్రకాష్, రాఘవరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కోశాధికారి కె.దాముఆచారి, ఆలయ గురుస్వామి కె.సత్యనారాయణ, పురోహితుడు కాశీచరణ్, నిర్వాహక కమిటీ ప్రతినిధులు నాగరాజ, కుప్పా రమేష్‌బాబు, ఆదినారాయణ, పులి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్లు వెంకటసుబ్బారెడ్డికి ప్రభుత్వ విప్ నివాళి



మల్లు వెంకటసుబ్బారెడ్డికి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : మండలంలోని పున్నాటివారిపల్లె గ్రామానికి చెందిన నీటిపారుదల శాఖ రిటైర్డు అధికారి మల్లు వెంకటసుబ్బారెడ్డికి ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు నివాళులు అర్పించారు. బుధవారం స్వగ్రామంలో నిర్వహించిన వర్ధంతికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముక్కా మధుసూదన్‌రెడ్డి, ఓజీ శ్రీనివాసులరెడ్డి, పున్నటి రామసుబ్బారెడ్డి, నారాయణ రెడ్డి, హోండా షోరూం అధినేత ఎంవీఎస్ ప్రసాద్ రెడ్డి, మల్లు మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నందలూరు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

సిద్దవటం : సిద్దవటంలోని బీసీ బాలుర వసతి గృహం ఆవరణంలో బుధవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. అనంతరం ఉపాధి ఏపీఓ నరసింహులు మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులకు రూ.4.84 కోట్లు ఖర్చు చేశామన్నారు. సామాజిక తనిఖీలో చిన్న చిన్న సమస్యలు తప్ప పెద్దగా ఏమీ లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జుబేదా, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటనారాయణ, అసిస్టెంటు విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ లక్ష్మినారాయణ, ఎంపీడీఓ జవహర్‌బాబు, ఈఓపిఆర్‌డి పులిరామ్‌సింగ్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- బాలుడి మృతితోనైనా అధికారులు మేల్కొనేనా?



నిత్యం రద్దీగా ఉండే పాతబస్టాండులో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్ : పట్టణంలో అనేక ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేక ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఉన్న వైర్లు తగిలి మూగజీవాలు మృత్యువాత పడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారుల్లో సైతం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయక పోవడం విమర్శలకు తావిస్తుంది. గతంలోని అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలను ఏర్పాటు చేసి ఉంటే ఈనెల 13వ తేదీ మున్సిపాలిటీ పరిధిలోని సుద్దగుంతల వద్ద ఉన్న రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ తగిలి శ్రీనివాసులు అనే బాలుడి ప్రాణాలు గాలిలో కలిసి పోయి వుండేవి కావని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే పాతబస్టాండు సమీపంలో, వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగించే కాకతీయ విద్యా సంస్థల వద్ద అలాగే ప్రధాన రహదారుల్లో, చిన్నపాటి వీధులకు వెళ్లే మార్గాల్లో కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుకు అనుకునే ఉన్నాయి. ఇలాంటి చోట వాహన చోదకులు అప్రమత్తంగా రాకపోకలు సాగించకుంటే ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం లేకపోలేదు. అందువల్ల మరొకసారి ఎవరి ప్రాణాలు కూడా గాలిలో కలిసి పోకముందే విద్యుత్‌శాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట
– మున్సిపల్ చైర్మన్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి శ్రీనివాసులు మృతి చెందడం విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని అనేక ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అయితే విద్యుత్‌శాఖ అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం గాలిలో కలిసి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని లేకుంటే ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ, జిల్లా కలెక్టర్‌లను కలిసి తానే స్వయంగా ఫిర్యాదు చేయనున్నట్లు చైర్మన్ హెచ్చరించారు.

రూ.25 వేలు ఆర్థిక సహాయం

మృతి చెందిన శ్రీనివాసులు కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తనవంతు సహాయంగా రూ.25 వేలు అందజేశారు. చదువుకుంటున్న మృతుని తమ్ముడికి తమ విద్యా సంస్థల్లో ఉచితంగా చదివిస్తామన్నారు. మృతుని కుటుంబానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.

పశువులకు ఆరోగ్య కార్డులు పంపిణీ



పశు ఆరోగ్య కార్డులను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : పశువులు, జీవాలకు సంబంధించిన పశు ఆరోగ్య కార్డులను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పంపిణీ చేశారు. మేడా భవన్‌లో ఎమ్మెల్యే మేడా, ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలచేత పశుసంవర్ధక శాఖ అధికారులు కార్డుల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అధికారులు వై.విజయభాస్కర రావు, కె.ప్రతాప్, ఎస్. శరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.